క్లుప్తంగా

అనంతుని ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నేడు

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. గిరిపై గతంలో పిడుగుపాటుకు దెబ్బతిన్న అనంతుని శిఖరాన్ని పునర్నిర్మించేందుకు కామన్ గుడ్ ఫండ్స్ రూ.60 లక్షలతో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అనంతరం పద్మనాభం సచివాలయం వద్ద ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయనున్నారని, అర్హులంతా తీసుకోవాలని ఆయన కోరారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ ప్రారంభం


అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో 'బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్' శిక్షణ కోసం రాష్ట్రంలో 13 నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు గురువారం వచ్చారు. వీరికి ఈ నెల 12 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి ఇన్‌స్ట్రక్టర్‌గా డాక్టర్ సి.రాకేష్ వ్యవహరించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీబా ఫ్రాన్సిస్, ఏవో పి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శైలజ బాధ్యతల స్వీకరణ



పద్మనాభం: పద్మనాభం ఎంపీడీవోగా బి.శైలజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా హిరమండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన ప్రభాకరరావు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆనందపురం ఎంపీడీవోగా అప్పలనాయుడు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో ఎంపీడీవో అప్పలనాయుడు

ఆనందపురం: ఆనందపురం ఎంపీడీవోగా ఎస్.అప్పలనాయుడు విజయనగరం జిల్లా భోగాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

త్వరలో బస్సు షెల్టర్ ఏర్పాటు


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ లొడగల అప్పారావు తెలిపారు. గత కొంత కాలంగా ఇక్కడ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారని, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రోజుల్లోనే షెల్టర్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు.

పథకాలతో ఆర్థిక స్వావలంబన


సంగివలసలో మహిళలకు రూ.8 కోట్ల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో వ్యాపారాలు చేసుకుంటూ వారి కాళ్లపై నిలబడి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు సంగివలసలో 299 డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.8,00,98,317 వైఎస్సార్ ఆసరా చెక్కు గురువారం ఆయన అందించారు. అలాగే రూ.33.35 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ లాంటి సినిమా హీరోలకు నటించడం మాత్రమే తెలుసన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన హీరో అన్నారు. తన వల్ల మంచి జరిగితేనే ఓటు వేయాలని నిర్భయంగా అడుగుతున్న జగన్ లాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా కనిపించరన్నారు. రానున్న ఎన్నికల్లో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. గతంలో భీమిలి ఎమ్మెల్యేకు ఇక్కడి ప్రజలెవరో, ప్రజలకు ఎమ్మెల్యే ఎవరో తెలిసేది కాదన్నారు. తాను పలుమార్లు 127 సచివాలయాల పరిధిలో ప్రజలను నేరుగా కలిశానన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా రూ.20 లక్షల వంతున ప్రతి సచివాలయం పరిధిలో అదనంగా అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. మహిళల నుంచి సమస్యలు తెలుసుకుని పరిష్కరించనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్సీ బి.రాము, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకర రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షులు చిల్లా భాస్కరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, శిష్టకరణాల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, కొప్పల రమేష్, చేట్ల ఎల్లయ్యరెడ్డి, సీనియర్ నాయకులు బింగి హరి కిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, పీతల వెంకట అప్పారావు, దల్లి అప్పలరెడ్డి, మద్ది మహాలక్ష్మి, సరగడ శివాంజనేయ రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల శ్రీనివాసరెడ్డి, గుండాసి మధు, జగన్నాథ ఎల్లాజీ, నమ్మి మాధవరావు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, ఊడికల శ్రీరామమూర్తి, కంచుబోయిన వెంకటరావు, కొసన శ్రీనివాసరెడ్డి, చేట్ల నరసింగ్‌రెడ్డి, బోర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సంగివలసలో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

505 మందికి వైద్య సేవలు


ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు బొగ్గురోడ్డు – 2 సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 505 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని భీమిలి జెడ్సీ బి.రాము సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు కేస్ షీట్లు అందించారు. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ మన గ్రామం ముంగిట్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. వైద్యులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు సుష్మిత, రమ్యశ్రీ, దిలీప్‌కృష్ణ, ఎ.సత్యనారాయణ, ఎచ్చెర్ల హరి తదితరులు పాల్గొన్నారు. వీరికి సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు సహకారం అందించారు.

ఆర్‌వో శివకుమార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్‌వో శివకుమార్

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 రెవెన్యూ ఆఫీసర్‌గా వైవీ శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి గురువారం జాయినింగ్ లెటర్ అందజేసి విధుల్లో చేరారు. ఈయన జోన్ – 3 నుంచి ఇక్కడకి బదిలీపై వచ్చారు. శివ గతంలో జోన్ – 2లో సూపరింటెండెంట్‌గా కూడా పనిచేశారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన ఆటో

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాలరిపేటకు చెందిన అల్లిపిల్లి శ్రీను, సత్య, శిరీష, యశ్వంత్, సురేఖ, చైత్ర, మణి ఆటోలో భీమునిపట్నం ఎగువపేటకు చెందిన బంధువుల ఇంటికి శుభకార్యానికి గురువారం వెళ్లారు. తిరిగి వస్తుండగా తిమ్మాపురం వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జుకాగా బస్సు అద్దం పగిలిపోయింది. ఆటో అతి వేగంగా రావడం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. గాయాలపాలైన వారిని 108 ద్వారా రుషికొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

మందుబాబులకు జరిమానా

పీఎం పాలెం : స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన నిందితులకు న్యాయస్థానం రూ.35 వేల జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కిన 11 మందిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అందరికీ కలిపి మొత్తం రూ.35 వేలు జరిమానా విధించారు.

ఆయుర్వేద పరిశోధనల్లో సీసీఆర్ఏఎస్ కృషి

కొమ్మాది: దేశంలో ఔషధ పరిశోధనల్లో సామాన్య ప్రజలకు చేరువయ్యేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) విశేషంగా కృషి చేస్తోందని సెంట్రల్ ఆయుర్వేదిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబు తెలిపారు. ఆరోగ్య రక్షణకు సంబంధించిన పరిశోధనలకు గల అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై రెండు రోజుల పాటు గీతంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో ఆయుష్ – 64 ఔషధం దేశ వ్యాప్తంగా ప్రజలకు వినియోగంలోకి తెచ్చామని, అదేవిధంగా ఆయుష్ – 84, ఆయుష్ – 56, ఆయుష్ మానస్, ఆయుష్ రసాయన ఔషధాలు వివిధ రోగాల నివారణకు ప్రజలు వినియోగించారన్నారు. ఇలా వాడడం ఆయుర్వేదంపై ప్రజలకు గల నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో శంకరరావుకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ ప్రియాంక


కేజీహెచ్‌లో మెరీనాకు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ సంధ్యారాణి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని 78వ నంబరు సచివాలయానికి చెందిన దుర్గాసి ప్రియాంక, వార్డు కన్వీనర్ దుర్గాసి అప్పారావు మధురవాడ నుంచి విశాఖపట్నం క్యూ1 ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. మధురవాడ స్వతంత్రనగర్‌కి చెందిన కాళహస్తి శంకరరావు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో వీరు ఆస్పత్రికి వెళ్లి కుటుంబీకుల సమక్షంలో గురువారం ఉదయాన్నే పింఛన్ నగదు అందజేశారు.

కేజీహెచ్‌లో వృద్ధురాలికి...

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌కు చెందిన మెరీనా అనే వృద్ధురాలు కాలికి చికిత్స చేయించుకునేందుకు కొన్ని రోజుల నుంచి కేజీహెచ్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ సంధ్యారాణి గురువారం కేజీహెచ్‌కు చేరుకుని రూ.3 వేలు పింఛన్ నగదు అందజేశారు. తమ కష్టకాలంలో ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయని మెరీనా అన్నారు.

బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మద్దతు

దాబాగార్డెన్స్: బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మా మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను వాడుకుంటున్న ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేలా, రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలు, దళిత, ఆదివాసీ, మైనార్టీ ప్రజలను నమ్ముకుంటే బీసీ నాయకులకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, కర్రి ధనుంజయనాయుడు, పల్ల రమణ, కామన వెంకట సుబ్బారావు, ప్రసాద్, పల్లి శ్రీనివాసనాయుడు, సంసద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే నర్సింహస్వామి కొండపైకి ఉన్న రోడ్డులో లైట్లు రెండు రోజుల్లో వేయాలని ఆదేశించారు. మహాత్మా గాంధీ కల్యాణ మండపం ఆధునికీకరణ పనులు వెంటనే ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జెడ్సీ రాముకు సత్కారం


జెడ్సీ రామును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా మండపేటకు బదిలీ కావడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్సీ రాము ఎంతో చక్కగా పని చేశారని, ఎటువంటి సమస్య ఉన్నా జాప్యం చేయకుండా పరిష్కరించారన్నారు. ప్రజలతో మంచి సత్సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. మండపేటలో కూడా మంచి సేవలు అందించి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లవీధిలోని శ్రీరాధాకృష్ణ స్వామి ఆలయం మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సన్యాసిరావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

జెడ్పీ హైస్కూల్‌లో వీడ్కోలు వేడుకలు


శ్రీభార్గవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: భీమిలి మండలం అమనాం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎ.ఆర్.విజయకుమారి కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 10వ తరగతి విద్యార్థిని బెల్లాపు శ్రీభార్గవి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.హరిబాబు, ఎస్.నాగభూషణం, మారుతి గణేష్, జాన్ వెస్లీ, వి.శంకరరావు, మహేష్, బాబూరతన్, విద్యాకమిటీ చైర్మన్ సీహెచ్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్య స్కూల్‌లో విద్యార్థిపై టీచర్ దాడి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధి మధురవాడలోని శ్రీ విద్య స్కూల్‌లో ఓ టీచర్ విద్యార్థి తలపై రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం బయటకు పొక్కడంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులపై స్కూల్ యాజమాన్యం ఒత్తిడి తీసుకొచ్చి రాజీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా క్రమశిక్షణ, ఎక్కువ మార్కుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్న ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

దేశ ఐక్యతకు జాతీయభాష దోహదం

డీఆర్‌డీవో శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు



డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో రాజభాష హిందీ ఎంతగానో దోహదపడుతోందని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధి అఖిల భారత సంయుక్త రాజ్‌భాషా సైంటిఫిక్ అండ్ టెక్నాలజీ రెండు రోజుల సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభూమికి, జాతీయ భాషకు సేవ చేయాలని కోరారు. దేశం ఐక్యంగా వుండాలంటే మాధ్యమంగా హిందీభాష అవసరమన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతను ప్రచారం చేయడంలో జాతీయ భాష దోహదపడుతుందన్నారు. ఐఎన్ఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పిజు నవేరా మాట్లాడుతూ దేశం సరిహద్దులు సురక్షితంగా వుంచడంలో డీఆర్‌డీవో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఇందులో సాకేతికత పోషించే పాత్రను వివరించారు. హిందీ భాషలో ఈ సెమినార్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. డీఆర్‌డీవో హెడ్ క్వార్టర్స్ డైరెక్టర్ (రాజభాష) డాక్టర్ రవీంద్ర సింగ్ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజంలో హిందీ భాషను ప్రోత్సహించడం, అందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారత నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలు అభివృద్ధి చేయడంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ రూపుదిద్దుకున్న పలు అయుధాల సాంకేతికతను వివరించారు. ఈ సందర్భంగా సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు తమ ఆలోచనలు ఆవిష్కరించారు. అనంతరం సావనీర్ ఆవిష్కరించారు. ఆహుతులకు డైరెక్టర్ అబ్రహం వర్గీస్ జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ జీసీ కేదార్‌నాథ్, కో ఆర్డినేటర్ వివేక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హిందీ విద్యార్థులకు 4న హాల్ టికెట్ల పంపిణీ

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 10, 11న భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంలో నిర్వహించే పరీక్షలకు 4న హాల్ టికెట్లు జారీ చేయనున్నారు. అదేరోజు విద్యార్థులకు ప్రీ ఫైనల్ – 2 పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

9న డీ వార్మింగ్ డే


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ డీ వార్మింగ్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవన్నారు. కన్సల్టెంట్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ పాల్గొన్నారు.